



సికింద్రాబాద్ నుండి మచిలీపట్నం వెళ్ళే రైలు విజయవాడలో ఆగేసరికి ఉదయం ఆరుగంటలయింది. నిద్రపోతున్న బాబును భుజాన వేసుకుని చేతిలో సూట్‌కేసుతో ఎసి కంపార్ట్‌మెంట్ నుండి దిగాడు హర్షవర్ధన్. దాదాపుగా ఎనిమిది సంవత్సరాల తరువాత చూసిన పరిసరాలను కలియజూసుకుంటున్నాడు. వెనుక నుండి భుజంమీద చేయి పడడంతో వెనక్కి తిరిగాడు.

"ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి?" అంటూ హర్షను కౌగలించుకున్నాడు మాధవ్.

నిద్రపోతున్న సంజయ్‌మీద వత్తిడి పడడంతో ఉలిక్కిపడి లేచి అరిచాడు.

"సారీరా నాన్నా... మీ నాన్నను చూసిన ఆనందంలో నిన్ను చూసుకోలేదు" అంటూ సంజయ్‌ని ఎత్తుకున్నాడు.

"నువ్వేం మారలేదురా అలాగే ఉన్నావు. అదే స్పీడు, అదే ఉత్సాహం..." అన్నాడు హర్ష మాధవ్‌తో.

"పరుగెత్తే ప్రపంచంలో మనమూ పరుగెత్తాలంటే ఉత్సాహంగా ఉండడం తప్పనిసరి. నువ్వు మాత్రం కాస్త ఒళ్ళు చేసావు. దొరబాబులా రంగు వచ్చావు"

వీళ్ల మాటలేవి అర్థం కాకపోయినా చారెడేసి కళ్లతో బిక్కమొహంతో వాళ్లను చూస్తున్నాడు సంజయ్.

"వీడు భలే ముద్దుగా ఉన్నాడు హర్షా" అన్నాడు మాధవ్ సంజయ్‌ని ముద్దు పెట్టుకుంటూ.

సంజయ్ వెంటనే చేత్తో తుడిచేసుకున్నాడు.

"ఇంతకీ మనం ఇక్కడే ఉండిపోదామా లేక ఇంటికి తీసుకువెళ్లే ఉద్దేశ్యమేమైనా ఉందా?" అన్నాడు హర్ష.

"అమ్మో... ఇప్పటికే అంతా మీ కోసం తెల్లవారుఝాము నుండే పడిగాపులు కాస్తున్నారు. పదండి వెళ్దాం" అంటూ స్టేషన్ బయటకు దారి తీసాడు మాధవ్.

స్టేషన్ బయట పార్క్ చేసివున్న కారు డోర్ ఓపెన్ చేసి బాబుని అందులో కూర్చోబెట్టి హర్ష చేతిలోని సూట్‌కేసు అందుకుని డిక్కీలో పెట్టాడు మాధవ్.

డ్రైవ్ చేస్తున్న మాధవ్‌లో హర్షను చూసినందుకు అంతులేని ఆనందం కనిపిస్తోంది. హర్ష అయితే బయటకు చూస్తూ తన్మయత్వం చెందుతున్నాడు.

"ఇల్లు వచ్చేసింది హర్షా" అన్న మాధవ్ మాటలకు అటువైపు తల తిప్పాడు.

చిన్నప్పటి తమ ఇంటి స్థానంలో ముచ్చటైన డాబా ఇల్లు ఉంది. ఇంటి ముందు ఖాళీ స్థలంలో ఉండే జామ, మామిడి, అరటి మొక్కలు మాత్రం అలాగే ఉన్నాయి. అందంగా డిజైన్ చేసిన లాన్ కూడా కొత్తగా కనిపిస్తోంది.

లాన్‌లో నుండి నడిచి వస్తున్న సుభద్రమ్మను చూడగానే హర్ష అడుగులు ఆమెవైపు వడివడిగా పడ్డాయి.

ఒక్కక్షణం తటపటాయించిన హర్షను సుభద్రమ్మ చెమర్చిన కళ్లు ఆమెను కౌగలించుకునేలా చేసాయి. హర్షకు తెలియకుండానే తన కళ్లు కూడా నీటితో నిండిపోయాయి.

"బాగున్నావా బావా" అన్న చందన పలకరింపుతో వాస్తవంలోకి వచ్చాడు హర్ష.

అప్పటికే చందన సంజయ్‌ని ముద్దు చేస్తోంది. చందనను అంటిపెట్టుకున్న పిల్లలిద్దర్నీ చూసాడు హర్ష. పాప చందనలాగా, బాబు మాధవ్‌లాగా కనిపిస్తుంటే "వీళ్లిద్దరూ మీ ఇద్దరికీ డూప్‌లలాగ అవుతారు పెద్దయ్యాక" అన్నాడు హర్ష.

అంతా ఒక్కసారిగా నవ్వారు.

హైందవి రెండు చేతులు జోడించి "నమస్తే అంకుల్" అంది. సూర్య అక్కలాగా చెప్పాలని చేతులను అడ్డదిడ్డంగా కలుపుతూ 'నమస్తే అంకుల్' అన్నాడు.

గట్టిగా నవ్వేస్తూ పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకుని "ఇదంతా మీ అమ్మ ట్రైనింగా" అన్నాడు హర్ష.

"ఊహూ... కాదు నానమ్మ చెప్పింది పెద్దవాళ్లు వచ్చినప్పుడు నమస్తే చెప్పాలని" అంది హైందవి.

"అవునా... మంచి అలవాట్లు నేర్చుకుంటున్నారన్నమాట" అన్నాడు హర్ష.

నానమ్మ ముద్దులతో మునిగిపోయిన సంజయ్‌ని "బ్రష్ చేసుకుని పాలు త్రాగుదువురా నాన్నా" అంటూ చందన లోపలకు తీసుకుని వెళ్తూ "నీవు కూడా కానివ్వు బావా తరువాత మాట్లాడుకోవచ్చు" అంది.

'చందన సన్నగా రివటలా ఉండేది. ఇప్పుడు ఒళ్లు చేసి వయసుతోపాటు పెరిగిన హుందాతనంతో తల నిండా పూలు, చేతుల నిండా గాజులు... మూర్తీభవించిన గృహిణిలా కనిపిస్తోంది' చందనను చూసి అనుకున్నాడు హర్ష.


తనతో అమ్మ ఎలా మాట్లాడుతుందో, చందన, మాధవ్ ప్రవర్తన ఎలా వుంటుందో అని భయపడిన హర్షకు వారి ఆహ్వానం మతి పోగొట్టింది.

మామూలుగా ఏమీ జరుగనట్లుగా ఉన్నారు. హర్ష ఆలోచనలు ఆతని బాల్యంలోకి పరుగుపెట్టాయి.

★★★

సుభద్రమ్మ తమ్ముడు కూతురు చందన. చిన్నతనంలోనే చందన తల్లీ దండ్రీ కాలం చేయడంతో మేనకోడలిని సుభద్రమ్మ చేరదీసింది. హర్షతో పాటు చందనను కూడా ప్రేమగా చూసేది.

సుభద్రమ్మ భర్త రాఘవయ్య వ్యవసాయం చేసేవాడు. దురదృష్టవశాత్తు పొలంలో పురుగు కుట్టి తగిన సమయంలో వైద్యం అందక చనిపోయాడు. ఆనాటి నుండి గృహ బాధ్యత సుభద్రమ్మ భుజాలపై పడింది. ఉన్న పొలాన్ని కౌలుకిచ్చింది. ఊళ్లో వున్న ప్రభుత్వ పాఠశాలలో సంగీత పాఠాలు చెప్పడానికి వెళ్లేది. ఆ రోజుల్లోనే ఆవిడ ఎస్ఎస్ఎల్సి పూర్తి చేసింది.



సాయంత్రంపూట ట్యూషన్లు చెప్పేది.

తీరిక సమయంలో బట్టలు కుట్టేది. పిల్లల చదువు ఆపకుండా నిరాటంకంగా సాగడానికి అష్టకష్టాలు పడేది. ఊహ తెలిసాక హర్ష, చందన 'చదువు మానేసి నీకు సహాయం చేస్తాం' అంటే కోప్పడేది.

"పోనీ బావను చదివిద్దాం. నేను మానేస్తాను" అనేది చందన.

"చదువు ఆడ, మగ ఎవరికైనా ఒక్కటే. ఎవరి కాళ్లమీద వారు నిలబడాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలి. ముఖ్యంగా ఆడవాళ్లు చదువుకుంటే ధైర్యంగా జీవించగలుగుతారు" అని మందలించేది.

ఆ ఊరిలో పదవ తరగతి వరకే ఉండడంతో మరికొందరు పిల్లలతో కలసి విజయవాడ వచ్చి చదువుకునేవారు. మాధవ్ కూడా వాళ్లల్లో ఒకడు. హర్ష, మాధవ్ మంచి ఫ్రెండ్స్ కూడా.

చిన్నప్పటి నుంచీ ఇరుగుపొరుగువారు, బంధువులు హర్ష, చందనలను కాబోయే భార్యాభర్తలు అని సరసాలాడుతుంటే సుభద్రమ్మ కూడా "అవును.. చదువయ్యాక వాళ్ల పెళ్లి చేస్తాను' అంటుండేది. అందం, అణకువ, వివేకం వున్న మేనకోడలిని కాదు అనుకునేంత అవివేకి కాదామె.

చందన మనసులో కూడా అదే భావం నాటుకుపోయింది. హర్ష మనసులో ఏమున్నా పైకి మాత్రం చందనపట్ల స్నేహంగానే ఉండేవాడు.

చందన డిగ్రీ చేసి బిఇడి ట్రైనింగ్‌కి వెళ్లింది. మాధవ్ అగ్రికల్చర్ ఎమ్ఎస్‌సిలో గోల్డ్‌మెడల్ తీసుకున్నాడు. జాబ్ ఆఫర్ వచ్చినా కాదని స్వంత ఊరిలో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులలో అభివృద్ధి సాధించాలని ఊరు వచ్చేసాడు. హర్ష ఎమ్‌బిఏ అవగానే వాళ్ల ప్రొఫెసర్ ఆయన కూతురితో వివాహం ఆ తరువాత ఇద్దరినీ అమెరికా పంపే ఉద్దేశ్యాన్ని హర్ష ముందు పెట్టాడు.

చిన్నప్పటి నుండి ఉన్న పేదరికం, ఆర్థిక ఇబ్బందులు అతడిని ఐశ్వర్యపు బరువువైపు మొగ్గు చూపేలా చేసాయి. ఆధునిక పోకడలతో వున్న రమ్యను, సంస్కారం తప్ప ఆస్తిలేని చందనతో బేరీజు వేసుకుని తన ఆలోచన సరైనదేనని నిర్ధారించుకుని తల్లికి ఈ విషయం చెప్పాడు.

కలలో కూడా ఊహించని విషయం విన్న ఆవిడ ఒక్క నిముషం తల్లడిల్లిపోయింది. అంతలోనే తేరుకుని "నీవు సంపాదిస్తావు, నీ నీడలో సుఖపడాలనే ఆశ కన్నా నాకున్న మీ ఇద్దరు నా కళ్ల ముందు వుంటారనే అత్యాశ నాది. ఊహ తెలిసిన నాటి నుండి నిన్నే భర్త అనుకున్నదాన్ని కాదని వెళ్తానంటున్నావు. దానికేం తక్కువ? ప్రశాంతమైన జీవితాన్ని ఐశ్వర్యంతో పోలుస్తున్నావు. వివేకంగా ఆలోచించు" అని అందామె.

"అమ్మా! నేను బాగా ఆలోచించాను. ఇక్కడే ఉంటే ఎప్పటికీ మధ్య తరగతి బ్రతుకు బ్రతకాలి. అనుకోని విధంగా వచ్చిన అవకాశాన్ని కాలదన్నుకోవడం అవివేకం. నేను అక్కడకు వెళ్లాక మీకు డబ్బు పంపిస్తాను. దానితో మీరు కష్టపడకుండా సుఖంగా ఉండవచ్చు. చందనకు మంచి సంబంధం చూసి పెళ్లి చేద్దాం" అన్నాడు హర్ష.

హర్ష కోరుకుంటున్నది తన అనుమతి కాదు. అతని నిర్ణయం అంగీకరించడం అని అర్థమయిన సుభద్రమ్మ ఇక తనేమీ మాట్లాడినా వృథా అని గ్రహించింది.

వీరిద్దరి సంభాషణ బయట నుండి అప్పుడే వచ్చిన చందన చెవిలో పడింది. కొద్దిసేపు తటపటాయించినా లోపలకు వచ్చి "బావా! నీ ఇష్టప్రకారమే కానివ్వు. నీవు మంచి స్థానంలో ఉండడమే మాకు గర్వకారణం" అని హర్షతో అని సుభద్రమ్మ వైపు తిరిగి "పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయంటారు. బావతో నా పెళ్లి వ్రాయలేదేమో. అనవసరంగా బావ మనసు నొప్పించకు అత్తా. సంతోషంగా బావ పెళ్లి జరిపించు" అంది.

అలా స్పష్టంగా మాట్లాడుతున్న చందనను చూస్తుంటే చాలా ఎదిగినట్లనిపించింది ఇద్దరికీ.

హర్ష పెళ్లి జరగడం, రమ్యతో కలసి అమెరికా వెళ్లడం వెంటవెంటనే జరిగిపోయింది.

***

తరువాత ఒకరోజు మాధవ్ సుభద్రమ్మగారింటికి వచ్చి చందనను వివాహం చేసుకుంటానని అడిగాడు.

"నాకు చందన అంటే ఎప్పుడూ ఇష్టమే. కానీ హర్ష చందనను వివాహం చేసుకుంటాడని అందరూ అనుకున్నట్లే నేనూ అనుకున్నాను. ఇప్పుడు చందనను అడిగితే జాలిపడి అడిగాను అనుకుంటుందేమోనని మిమ్మల్ని అడుగుతున్నాను" అన్న మాధవ్ అన్న మాటలలో నిజాయితీ ఆవిడ గ్రహించింది.

చందనకు మాధవ్ మాటలు చెప్పి అభిప్రాయం చెప్పమంది ఆవిడ.



## నేనలాంటిదాన్ని కాదు

శిల్పాశెట్టి తన ప్రియుడు-కోటీశ్వరుడైన రాజ్ కుంద్రా ఈ ఏడాది అక్టోబర్‌లో పెళ్లి చేసుకోవచ్చునట. రాజ్ మాజీ భార్య కవిత- తన కాపురాన్ని శిల్పా కూల్చేసిందని ఇటీవల చేసిన ఆరోపణలకు శిల్పా స్పందించింది. 'నేను ఎవరి కాపురాలూ కూల్చే మనిషిని కాను. రాజ్ తన భార్యకి విడాకులు ఇచ్చాకనే మా మధ్య 'స్నేహం' కుదిరింది. అది పెళ్లిచేసుకుందాం అనేవరకూ వచ్చింది. నాకు పిల్లలంటే ఇష్టం. కనీసం ఇద్దరు పిల్లల్నయినా కనాలని ఆశిస్తున్నాను' అంటోంది శిల్పాశెట్టి.



"నీకు ఇష్టమైతే నాకు అభ్యంతరం లేదత్తా" అంది చందన.

"మనం ప్రేమించినవారికన్నా మనల్ని ప్రేమించిన వారిని చేసుకుంటే జీవితం సుఖవంతం అవుతుందమ్మా" అంది సుభద్రమ్మ.

"బావవల్ల నేను బాధపడ్డాను. నావల్ల మరొకరు బాధపడకూడదు. నీ మాట నేను అంగీకరిస్తాను" అంది చందన.

అలా మాధవ్, చందన ఒకింటివారయ్యారు. చందనకు గవర్నమెంట్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. సుభద్రమ్మను కూడా మాధవ్ వాళ్ల ఇంటికి వచ్చేయమన్నాడు. ఆవిడ ససేమిరా ఒప్పుకోకపోవడంతో మాధవ్ తల్లిదండ్రుల అనుమతి తీసుకుని చందన మాధవ్‌లే ఆవిడ ఇంటికి వచ్చేసి అక్కడే ఉండసాగారు.

***

యుఎస్ వెళ్లాక కొంతకాలానికి హర్ష తల్లికి డబ్బు పంపాడు.

ఆవిడ "ఈసారికి తీసుకుంటాను. మరోసారి పంపితే త్రిప్పి పంపుతాను. ఇక్కడ డబ్బుకోసం ఇబ్బంది పడేవాళ్లు ఎవ్వరూలేరు పంపవద్దు" అని గట్టిగా జాబు వ్రాసారు. మొదట్లో బ్రతిమాలినట్ల ఉత్తరాలు వ్రాసినా తరువాత ఆవిడ మనసు అర్థమయి అదీ మానేసాడు.

కాలం గడుస్తున్నకొద్దీ హర్షకు తను చేసిన తప్పు కొద్దికొద్దిగా అర్థమవసాగింది. రమ్య అక్కడి జీవితానికి అలవాటు పడినంతగా హర్ష అలవాటు పడలేకపోతున్నాడు. రొటీన్‌గా ఉద్యోగం, రెస్టారెంట్లు, వీకెండ్ డేస్‌లో షికార్లు ఇవేవీ అతడికి సంతృప్తిని ఇవ్వడంలేదు. అవన్నీ కృత్రిమంగా అనిపిస్తున్నాయి. ఇప్పుడతనికి కావాల్సినంత డబ్బు, బంగళా, కారు అన్నీ ఉన్నాయి. పెద్ద హోదా కూడా ఉంది. అనుబంధాలు, ఆత్మీయతలకు కరువు వాచినట్లయింది. మనసారా మాట్లాడేవారే లేకపోయారు. ఎవరిని చూసినా డబ్బు, సంపాదన కోసం తాపత్రయమే తప్ప ప్రశాంతత కనిపించడంలేదు.

చిన్నప్పుడు చేలగట్ల వెంబడి తిరగడం, స్నేహితులతో ఆటలాడడం, వెన్నెలలో అమ్మ చందనకు తనకు కలిపి తినిపించిన ఆవకాయ అన్నం ముద్దల్లో కమ్మదనం, విజయవాడదాకా వచ్చి చదువుకోవడం... ఇవన్నీ తలచుకున్నకొద్దీ మరీ మరీ హర్షకు గుర్తుకు వస్తున్నాయి. తండ్రి లేకపోయినా తమను పెంచడానికి తల్లి పడిన కష్టాలు కళ్లముందు కనిపించేవి. తన స్వార్థం కోసం ఆమెను వదిలి రావడం ఎంత పెద్ద తప్పో తెలిసేసరికి చాలా ఆలస్యమైపోయింది అనుకుంటూ పదే పదే బాధపడేవాడు.

మనసువిప్పి రమ్యకు చెబుదామన్నా వినే తీరుబడి ఆమెకులేదు. చిన్నప్పటి నుండి సంపన్న కుటుంబంలో పెరిగిందేమో కష్టాలు, బాధలు ఆమెకు తెలియవు. సెంటిమెంట్లు అంతకన్నా లేవు. ఎప్పుడైనా విన్నా 'అవన్నీ మరచిపోయి లైఫ్‌ని ఎంజాయ్ చేయి' అని ఒక్క మాటతో తుంచేసేది.

రమ్య పిల్లలను కనడానికి చాలా సంవత్సరాల వ్యవధి తీసుకుంది. సంజయ్ పుట్టాక హర్షకి అమ్మ మరీ మరీ గుర్తుకువచ్చేది. తనపట్ల తల్లి చూపించిన ప్రేమ కళ్లల్లో కదలాడేది.

వాడిని కేర్ హోంలో ఉంచుతుంటే ప్రాణం విలవిల్లాడేది. ఉద్యోగస్థులు కావడంతో అది తప్పనిసరి అవడంతో మౌనం వహించేవాడు. అమ్మ దగ్గర ఉంటే ఎంత బాగుండేదో అనిపించేది.

తల్లిని చూడాలనీ, క్షమాపణ అడగాలనే కోరిక అతనిలో అంతకంతకూ పెరగసాగింది. మాధవ్, చందనలు తల్లినెలా చూస్తున్నారో? తనకేలేని బాధ్యత వారికెలా వుంటుంది?


అసలు తనను వాళ్లు క్షమిస్తారా? అని అనుక్షణం బాధపడేవాడు. పర్యవసానం ఏదైనాసరే ఎదుర్కోవడానికి సిద్ధపడి సంజయ్‌ని తీసుకుని ఇండియా వస్తున్నట్లు మాధవ్‌కి తెలియజేసాడు.

"బావా! స్నానం చేసాక కూర్చోవచ్చులే" అన్న చందన పిలుపుతో గతం నుండి వాస్తవంలోకి వచ్చి లేచి బాత్రూమ్‌వైపు నడిచాడు హర్ష.

హర్ష వచ్చాడని తెలిసి ఊరిలోనివారు, బంధువులు ఇంటికి రాసాగారు. వచ్చిపోయేవారి పలకరింపులతో రోజులు గిర్రున తిరిగిపోతున్నాయి.

సంజయ్ ఎంత ఇబ్బంది పెడతాడో అని హర్ష భయపడ్డాడుగానీ చందన వాళ్ల పిల్లలతో బాగా కలసిపోయాడు. చందన, మాధవ్‌లకు కూడా చేరికయ్యాడు. నా నమ్మకయితే చెప్పనవసరంలేదు. స్నానం, భోజనం, నిద్ర అన్నీ ఆవిడతోనే.

తెలుగు రాకపోయినా ఆవిడ మాటలలోని లాలన వాడికి నచ్చింది. హర్ష ఉనికినే మరచిపోయినట్లుగా నానమ్మను హత్తుకుపోయాడు. ఉదయం, సాయంత్రం మాధవ్‌తో కలసి పొలం వైపు వెళ్లడం, అమ్మతో విరామ సమయంలో కబుర్లు చెప్పుకోవడం, పిల్లల అల్లరి... వెరసి హర్షకు



## శాస్త్ర పరిజ్ఞానం

ప్రపంచంలో ఏ ఒక్క మనిషివీ వేలిముద్రలు మరొకరితో సమంగా ఉండవు. అందుకనే నేరస్థలంలో తమ వేలి ముద్రల ప్రింట్స్ వస్తువులపై పడకుండా నేరస్థులు గ్లోవ్స్ ధరిస్తుంటారు. అయితే శాస్త్ర పరిజ్ఞానం రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బ్రిటిష్ పోలీసులు ఏ ఒక్కరి గ్లోవ్స్ ప్రింట్ మరొకరితో పోలి ఉండవని కనుక్కున్నారుట. దీనితో నేరస్థుల్ని పట్టుకోడం చాలా సులువని వారు భావిస్తున్నారు. కొన్ని కేసుల్లో నేరస్థుల్ని చాలా తేలిగ్గా పట్టుకోగలిగారు కూడా.

-తటవర్తి



ఆహ్లాదకర వాతావరణంలోకి అడుగుపెట్టినట్లయింది. ఆ ఇల్లు ఇంటిలా కాకుండా స్వర్గంలా కనిపిస్తోంది అతనికి.


మాధవ్ సుభద్రమ్మగారితో "అమ్మా...అమ్మా" అంటూ ప్రతి విషయానికీ సంప్రదించడం చూస్తుంటే చూడముచ్చటగా అనిపిస్తోంది. ఆవిడ కూడా చందన స్కూలుకు వెళ్లగానే మిగిలిన పనులన్నీ పూర్తి చేసే బాధ్యత తీసుకున్నారు. పిల్లలు తమ సందేహ నివృత్తులన్నీ ఆవిడ దగ్గరే తీర్చుకుంటున్నారు. ఖచ్చితంగా చెప్పాలంటే ఆ ఇంటి పెద్ద దిక్కు ఆవిడే. పెంచినందుకు చందన తన ఋణం తీర్చుకుంటోంది. కానీ తనే కన్నందుకు ఏమీ పట్టించుకోకుండా వదిలివేసాడు. వెళ్లడంవల్ల తను పొందిన ప్రయోజనమేమిటి? ఇక్కడ ఉండి వీళ్లు నష్టపోయినదేమిటి?

మాధవ్, చందన ఆధునిక వసతులతో ఇల్లు కట్టుకున్నారు. కారు కొనుక్కున్నారు. పిల్లలతో ప్రశాంతమైన ఆరోగ్యకర వాతావరణంలో ఉన్నారు. తను ఆర్థికంగా వీళ్లకన్నా ముందున్నాడేగానీ ఏ విధంగా చూసినా యాంత్రికమైన జీవితాన్నే అనుభవిస్తున్నాడు.



## రూటు మార్చిన సంధ్య

తమిళ, మలయాళంలో కూడా ఒకటీ అరా ఆఫర్లతో వున్న సంధ్య తన రూటు మారుద్దామని ఆలోచించినట్టుంది. అందుకనే ఓ తమిళ చిత్రంలో నెగటివ్ పాత్రని ఒప్పుకుందిట. ఇది గనక సక్సెస్ అయితే ఒక్కసారిగా నలుగురి దృష్టిలోకి తిరిగి రావచ్చు, తద్వారా మరిన్ని సినిమాలు చేజిక్కించుకోవచ్చు అని సంధ్య ఆశ కాబోలు. మరి ఆమె ఆశ ఎంతవరకూ తీరుతుందో!




***

వంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న హర్ష దగ్గరకు చేతులు చీరకొంగుతో తుడుచుకుంటూ అక్కడకువచ్చిన సుభద్రమ్మ "ఏంటి బాబూ... బోరుగా అనిపిస్తోందా?" అంది ప్రక్కన కూర్చుంటూ.

కాదని తల అడ్డంగా ఊపుతూ "నీ ఒళ్లో పడుకోనా అమ్మా" అన్నాడు.

"నీవెంత పెద్దవాడవయినా నాకు మాత్రం చిన్నవాడివే బాబూ", అంది.

తల్లి వళ్లో పడుకున్న హర్ష "అమ్మా! ఒక్క మాట అడగనా", అన్నాడు జీరబోయిన స్వరంతో.

హర్ష గొంతులో వేదన అర్థం చేసుకున్న ఆవిడ "నిరభ్యంతరంగా అడుగు నాన్నా" అంది తల నిమురుతూ.

"నేను జీవితంలో ఓడిపోయాననిపిస్తోంది అమ్మా. ఇప్పుడు నాకు కావాల్సినంత డబ్బు ఉంది. కానీ అది తృణప్రాయంగా అనిపిస్తోంది. నేను ఎంచుకున్న మార్గం సరైంది కాదు కాబట్టే ప్రశాంతత కరువైందని నాకు అర్థమయింది. ఇప్పుడు నేనేం చేయాలో తెలియడంలేదు."

"తప్పు హర్షా... ఎవరి జీవితం వర్ధించిన విస్తరి కాదు. ఓడిపోయాను అనే మాట మనసులోకి వచ్చిందంటే మనిషికి నిస్సత్తువ వచ్చినట్లే. తప్పో వప్పో ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు దానికి కట్టుబడి ఉండాలి. మొదటి నుండి ప్రేమ, అనుబంధాలలో పెరిగిన నీకు అంతస్థుల హోదాలు తృప్తిని ప్వడంలేదు. వాటిలోనే పుట్టి పెరిగిన వారికి ఆత్మీయత రుచి తెలిసినవారికి లంకె కుదరదు. కానీ సంసారానికి సర్దుబాటు అవసరం. కోరి చేసుకున్నప్పుడు అనుకూలంగా మలచుకోవడం కూడా నీ చేతిలోనే వుంది. అమ్మకు ఆధారంగా నిలబడకుండా మాట జవదాటాను అనే విషయం అడుగడుగునా నిన్ను బాధ పెడుతోంది. జరిగిందేదో జరిగిపోయింది. చందన నా కన్నబిడ్డలాగా నాకు అండగా నిలబడింది. మాధవ్ కూడా ప్రేమగా ఉంటాడు. ఇదంతా నీవు చూసావు. ఈ ఇంట్లో నా స్థానం చూసిన నీవు ప్రశాంతంగా ఉండు. భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేందుకే మమ్మల్ని కాదన్నావు. ఈ రోజు దానికన్నా ఇదే బాగుందనిపిస్తుందనడం నీ అస్థిరత్వాన్ని తెలుపుతోంది. కన్నతల్లి, జన్మభూమి ఎప్పుడూ చల్లనివే. పరాయి దేశంలో ఆ చల్లదనాన్ని ఆశించడం కూడా తప్పే. డబ్బే ప్రధానంగా భావించే చోట ఆత్మీయతకై వెంపర్లాడటంలో అర్థంలేదు. క్షణం తీరికలేని బిజీ వాతావరణంలో ప్రశాంత వాతావరణం ఎలా లభ్యమవుతుంది? కొన్ని కావాలనుకుంటే కొన్ని వదులుకోక తప్పదు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక ఇమడలేని పరిస్థితుల్లో ఉండడం కంటే ఇండియా వచ్చేయ్యవచ్చుకదా. తప్పు చేసాను అనే అశాంతితో బాధపడడంకన్నా సరిదిద్దుకుని నిలదొక్కుకోవడంలో శాంతి వుంటుంది. అర్థమయిందనుకుంటా" అని మృదువుగా చెప్పింది సుభద్రమ్మ.

మంత్రముగ్ధుడిలా ఆమె మాటలు విన్న హర్ష చిక్కుముడి వీడినవాడిలా ఒక్కుదుటున లేచి కూర్చున్నాడు.

"నేను రెండురోజుల్లో యుఎస్ వెళ్లిపోతాను. ఇండియాలో ఉండిపోయేటట్లుగా అన్ని ఏర్పాట్లు చేసుకుని వస్తాను. అప్పటివరకు సంజయ్..."

అతడి మాటలను మధ్యలోనే ఆపేస్తూ "మా దగ్గరే మా మధ్యనే ఉంటాడు" అంటూ లోపలకు వస్తూ అంది చందన.

"మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానేమో?" అన్నాడు హర్ష.

"ఇబ్బంది కాదది ఆనందం" అంటున్న సుభద్రమ్మ ముఖంలో మనవడు తన దగ్గరే ఉంటున్నందుకు ఆనందం తాండవిస్తోంది.

★